సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 14 । జూలై । 2023

I



పెద్దపులి సంచారం

IIలో

అనంతగిరి, దేవరాపల్లి మండలాల సరిహద్దులో పెద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.



దుష్ప్రచారం తగదు

IIలో

ఏటికొప్పాక లక్కబొమ్మలకు వినియోగించే రంగులపై తప్పుడు ప్రచారం చేయడం తగదంటూ కళాకారులు ఆందోళన చేపట్టారు.



సహస్ర తులసిపూజ

విశాఖ: కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. పంచామృతాభిషేక సేవ ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

- విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



తుమ్మపాల: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింతగా మెరుగు పరచి, పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని గుండాలు దగ్గరున్న సచివాలయంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యతోపాటు ఆవరణ, తరగతి గదుల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా, పారిశుధ్యం–పరిశుభ్రత పక్కాగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యా బోధనలో అవసరమైన మార్పులు చేసి విద్యార్థుల్లో జ్ఞానంతోపాటు, విద్య పట్ల ఆసక్తి పెంచాలన్నారు. విద్యార్థుల అవగాహన స్థాయిని తెలుసుకునేందుకు 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ టెక్నాలజీ వినియోగం పెంచేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు తగినంత సహాయం అందించాలన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, ముందస్తు గర్భం వంటి వాటివల్ల జరిగే నష్టాలను తెలియజేస్తూ, సాంఘిక దురాచారాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఏడీ రవిబాబు, సర్వశిక్ష అభియాన్ ఈఈ నారాయణరావు, జేఈ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శివారు ఆయకట్టుకు నీరందేలా ప్రణాళిక

- తాండవ ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు



తాండవ కాలువను పరిశీలిస్తున్న ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు

నాతవరం: ఖరీఫ్ సాగులో శివారు ఆయకట్టుకు సైతం పుష్కలంగా తాండవ రిజర్వాయరు నీటిని సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు అన్నారు. గురువారం ఆయన తాండవ ప్రధాన కుడి, ఎడమ కాలువలను పరిశీలించారు. కాలువలో పలు చోట్ల పూడిక పెరిగిపోవడంతో దానిని యుద్ధప్రాతిపదికన తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని జేఈలకు ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఆశించిన విధంగా వర్షాలు కురవకపోవడంతో తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం గత ఏడాది కంటే తక్కువగా ఉందన్నారు. తాండవ ప్రాజెక్టు ప్రమాదస్థాయి నీటి మట్టం 380 అడుగులు, డెడ్ స్టోరేజీ నీటి మట్టం 345 అడుగులన్నారు. ప్రస్తుత నీటి మట్టం 369.6 అడుగులు ఉందన్నారు. వర్షాలు కురిస్తే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే ఇన్‌ఫ్లోతో నీటి మట్టం పెరిగే అవకాశముందన్నారు. ఆగస్టు మొదటి వారంలో ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామన్నారు. ఈలోగా కాలువలో ఉన్న అడ్డంకులు తొలగిస్తామన్నారు. క్వాలిటీ కంట్రోల్ జేఈ వి.ఉషారాణి, జేఈలు శ్యామ్‌కుమార్, రామకృష్ణ సిబ్బంది ఉన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

అనకాపల్లిటౌన్: అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(న్యూఢిల్లీ) ద్వారా ప్రగతి సాక్ష్యం ఉపకార వేతనాలకు అర్హత సాధించిన రేబాక పాలిటెక్నిక్ విద్యార్థులు 16 మందిని ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు గురువారం అభినందించారు. ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్లపాటు రూ.లక్షా 50 వేలు ఉపకారవేతనం అందుతుందన్నారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు విద్య, ఉపాధి అవసరాలకు మాత్రమే దానిని వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హరిత హారం

అశోకుడు చెట్లు నాటించెను.. ఇది చరిత్ర. ఇపుడు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటకపోతే మన బతుకులు కూడా త్వరితగతిన చరిత్రలో కలిసిపోతాయి. అంతగా కాలుష్య స్థాయిలు ఏటా పెరుగుతున్నాయి. అందుకే ప్రభుత్వం అవకాశమున్న ప్రతిసారీ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ఇపుడు సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో వన నర్సరీలకు శ్రీకారం చుట్టింది. దీని ద్వారా జిల్లాలో 15 లక్షల మొక్కల్ని నాటేందుకు సంకల్పించింది.

వన నర్సరీలతో నవ వసంతం

- సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో రైతులకు మొక్కలు అందజేత
- జిల్లాలో 48 వన నర్సరీల ద్వారా 15 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం
- చిన్న, సన్నకారు రైతులు, ఉపాధి కూలీలకు ఉచితంగా మొక్కల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా వివిధ రకాల మొక్కలు



సీఎస్ఆర్ నిధులతో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు



అందుబాటులో ఉన్న సరుగుడు నారు



మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో లక్ష్మణ్(ఫైల్)



నర్సరీలో టేకు మొక్కలు

కె.కోటపాడు : సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో వనాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు అనకాపల్లి జిల్లాలో 48 చోట్ల వన నర్సరీలను ఏర్పాటు చేసింది. వర్షాలు పడే సమయానికి మొక్కలను అందించేలా సామాజిక అటవీశాఖ సిబ్బందిని ఆదేశించింది. చిన్న, సన్నకారు రైతులతో పాటు ఉపాధి వేతనదారులకు ఉచితంగా ఈ మొక్కలను ఉచితంగా అందించనుంది. వీటి పెంపకం తమకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పంపిణీకి 15 లక్షల మొక్కలు

జిల్లాలో వన నర్సరీల ద్వారా పంపిణీ చేసేందుకు సుమారు 15 లక్షల మొక్కలను సిద్ధం చేశారు. గత ఏడాది నర్సరీలలో మిగిలి ఉన్న మొక్కలతో పాటు ఈ ఏడాది సిద్ధం చేసిన మొక్కలు కలిపి ప్రస్తుతం 11 లక్షల మొక్కలు ఉన్నాయి. వీటితో పాటు కాంపా స్కీంలో రెండు లక్షల 25 వేల మొక్కలు, జీరో సైన్ స్కీమ్‌లో లక్షా 20 వేల మొక్కలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు.

రైతులకు ఆదాయం

వన నర్సరీలలో పెంచుతున్న మొక్కలను రైతులు తమ స్థలాల్లో పెంచడం వల్ల ప్రత్యామ్నాయ ఆదాయం కూడా సమకూరుతుంది. ఈ నర్సరీలలో ప్రధానంగా మెట్ట ప్రాంత రైతులకు అనుకూలంగా ఉండే సరుగుడు, టేకు, జీడి మొక్కలను పెంచుతున్నారు. సరుగుడు పంట రైతులకు నాలుగేళ్ల నుంచి ఐదేళ్లకు కోతకు వచ్చే పరిస్థితి. దీంతో సరుగుడు సాగు లాభసాటిగా ఉంటుందని అధికారులు చెప్తున్నారు. మొక్కలను నాటేందుకు ప్రస్తుత సమయం చాలా అనుకూలం. వాతావరణం చల్లబడడంతో పాటు వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈ సమయంలో మొక్కలు నాటితే, వర్షాలు పడ్డాక ఏపుగా ఎదిగుతాయి. తర్వాతి పరిస్థితుల్ని తట్టుకుని నిలబడతాయి.

రోడ్లకు ఇరువైపులా మొక్కలు

సోషల్ ఫారెస్ట్ అధికారులు వన నర్సరీలలో పెంచుతున్న మొక్కలను కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులతో రోడ్లకు ఇరువైపులా నాటుతున్నారు. ఎన్టీపీసీ నిధులతో కె.కోటపాడు మండలంలో గత ఏడాది ఎ.భీమవరం–ఎం.అలమండ గ్రామాల మధ్య, సూర్రెడ్డిపాలెం–మేడిచర్ల గ్రామాల మధ్య, ఈ ఏడాది ఎం.అలమండ–తారువ గ్రామాల మధ్య 4 కి.మీ. చొప్పున మొత్తం 12 కి.మీ. మేర రోడ్డుకు ఇరువైపులా బాదం, కదంబ, ఫెల్టోఫారం, తురాయి, తెల్లమద్ది తదితర మొక్కలను నాటారు. సోషల్ ఫారెస్ట్ సిబ్బంది సంరక్షణలో ఈ మొక్కలు ఏపుగా ఎదిగి పచ్చదనంతో దర్శనమిస్తున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో కూడా మొక్కల్ని నాటేందుకు అందిస్తున్నారు. పరిశ్రమలకు జిల్లా కలెక్టర్ నిర్ణయించిన ధరకు ఈ మొక్కలను అందించనున్నట్లు సోషల్ ఫారెస్ట్ అధికారులు చెప్పన్నారు.

నర్సరీల వద్ద సంప్రదించాలి



రైతులకు వన నర్సరీల ద్వారా మొక్కలను ఉచితంగా అందించనున్నాం. మొక్కలు కావాల్సిన రైతులు సంబంధిత దరఖాస్తుపై సర్పంచ్ లేదా పంచాయతీ కార్యదర్శి, వలంటీర్ సంతకాలు చేయించి, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జెరాక్స్‌లను సమర్పించాలి. దరఖాస్తు చేసుకున్న రైతులకు నిర్దేశిత సంఖ్యలో మొక్కలను అందిస్తాం. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలి.

– చిరికి గోవింద, వన సేవకుడు, కొత్త అగ్రహారం

రైతులకే తొలి ప్రాధాన్యం



అనకాపల్లి జిల్లాలో వన నర్సరీల ద్వారా రైతులకు అవసరమైన సరుగుడు, టేకు, జీడి వంటి మొక్కలతో పాటు టాల్ ప్లాంటేషన్ మొక్కలను కూడా అందిస్తున్నాం. రైతులకు వీటిని ఉచితంగా ఇస్తాం. రోడ్లకు ఇరువైపులా మొక్కలు వేయడంతో పాటు ప్రస్తుతం గ్రామాల్లో చెరువుల సుందరీకరణలో గట్టుపై నీడనిచ్చే మొక్కలను వేసేందుకు ప్రోత్సహిస్తున్నాం.

– జి.లక్ష్మణ్. డీఎఫ్‌వో, సోషల్ ఫారెస్ట్, అనకాపల్లి జిల్లా

నర్సీపట్నంలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్

- రూ.3 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ స్థల పరిశీలన



జీసీసీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎండీ సురేష్‌కుమార్

నర్సీపట్నం: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో నర్సీపట్నంలో రూ.3 కోట్లతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన నర్సీపట్నంలోని జీసీసీ స్థలం, గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనిట్ ఏర్పాటుకునర్సీపట్నం జీసీసీ స్థలంతోపాటు మర్రిపాలెంలోని స్థలాన్ని పరిశీలించామన్నారు. నర్సీపట్నంలో జీసీసీ గోదాములు ఉన్నందున యూనిట్‌ను ఇక్కడే ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఆరు నెలల వ్యవధిలో కాఫీ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. జీసీసీకి సొంతంగా కాఫీ యూనిట్ అందుబాటులోకి వస్తున్నందున గిరిజనులకు మేలు జరుగుతుందన్నారు. రవాణా, ప్రాసెసింగ్ ఖర్చులు ఉండవని, ఖర్చు తగ్గటం వల్ల గిరినులకు రేటు ఎక్కువగా ఇవ్వవచ్చన్నారు.

అడ్డురోడ్డులో నేడు జాబ్ మేళా

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు ఎస్‌వీఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఈ ఇంటర్వ్యూలకు ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదువుకున్న యువతీ యువకులు, 18 నుంచి 40 సంవత్సరాలులోపు వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉదయం 9 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఆయా పరిశ్రమల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. మరిన్ని వివరాలకు 8309561123 ఫోన్ నంబరుకు సంప్రదించాలన్నారు.

• చందమామను అందుకుందాం



శ్రీహరికోట నుంచి శుక్రవారం నింగికి ఎగరనున్న చంద్రయాన్‌-3 భారత వ్యోమనౌక ప్రయోగం విజయవంతం కావాలంటూ మండలంలోని బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో కొద్ది సేపు ధ్యానం చేశారు. అనంతరం చంద్రయాన్‌-3 నమూనాతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించి విజయీభవ, దిగ్విజయీభవ అంటూ నినాదాలు చేశారు. స్థానిక కేజీబీవీ ప్రత్యేకాధికారి సిహెచ్.భువన మాధురి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.

– దేవరాపల్లి

17న రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

అనకాపల్లిటౌన్: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలు ఈ నెల 17న గుంటూరు, తెనాలి మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎల్.వి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 18 సంవత్సరాల్లోపు వయసున్న బాలురు ఈ పోటీలకు అర్హులన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు ఆధార్, బర్త్ సర్టిఫికెట్, సివిల్ సర్జన్ జారీ చేసిన ఫిట్‌నెస్ ధ్రువపత్రాలతోపాటు 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9032991543 నంబర్లో సంప్రదించాలన్నారు.

రేపు వాహనాల వేలం పాట

అనకాపల్లిటౌన్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి, సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 15న అనకాపల్లి మండలంలోని గుండాల కూడలి ఎస్ఈబీ కార్యాలయం వద్ద బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జె.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనాలనుకునేవారు ముందుగా రూ.3 వేలు ధరావతు చెల్లించాలన్నారు. పాటలో వాహనాన్ని సొంతం చేసుకున్న వారు అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనాలు దక్కనివారికి చెల్లించిన నగదును తిరిగి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఉపమాక క్షేత్రం విశిష్టతలకు నిలయం



ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావుకు పూర్ణకుంభ స్వాగతం

- వెంకన్న దర్శనంతో మధురానుభూతి
- ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

నక్కపల్లి: ప్రముఖ ప్రవచనకర్త, ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గురువారం ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఉపమాక క్షేత్రాన్ని, ఆలయ విశిష్టతలను, స్థల పురాణాన్ని అర్చకులు చాగంటికి వివరించారు. గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారి నిజరూపాన్ని చాగంటి మెట్ల మార్గం గుండా వెళ్లి దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయంలో దర్శనం అనంతరం చాగంటి భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఉపమాక క్షేత్రం విశిష్టతలకు నిలయమన్నారు. స్వామివారి దర్శనంతో తనకు ఎంతో మధురానుభూతి కలిగిందన్నారు.

నిజరూపానికి నిత్యం అభిషేకం చేయడం, ఉత్సవ మూర్తులకు ప్రధాన ఆలయాన్ని నిర్మించడం, అనేక సేవలు పూజామూర్తులకు నిర్వహించడం చాలా అరుదుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు భాగవతం సాయిగోపాలాచార్యులు, శ్రీవారి సేవకులు నున్న సుభాష్, గురు భవానీ రాంబాబు పలువురు భక్తులు పాల్గొన్నారు.

మా జోలికొస్తే ఖబడ్దార్



మా జోలికొస్తే ఖబడ్దార్ అంటూ పవన్‌కు చెప్పలు చూపిస్తున్న వలంటీర్లు

- నిబద్ధతతో పనిచేస్తున్న మాపై అనుచిత వ్యాఖ్యలా..
- పవన్ కల్యాణ్‌పై వలంటీర్ల ఆగ్రహావేశాలు
- పవన్ దిష్టి బొమ్మకు చెప్పల దండతో ఊరేగింపు



వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డ వలంటీర్లు

బుచ్చెయ్యపేట: నిబద్ధతతో పనిచేస్తున్న తమపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై బుచ్చెయ్యపేట మండల వలంటీర్లు తీవ్రంగా ఆగ్రహించారు. 'ప్రజా సేవకు అంకితమైన మమ్మల్ని అవమానించే హక్కు నీకెక్కడిది' అంటూ గురువారం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి వడ్డాదిలో ఊరేగించారు. అక్కడ నాలుగు రోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి జనసేన అధ్యక్షుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పవన్ కల్యాణ్.. ఖబడ్దార్ అంటూ చెప్పులు చూపించారు.

తమకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ దిష్టిబొమ్మను వలంటీర్లు కాళ్లతో తన్నుతూ పెట్రోల్ పోసి దగ్ధం చేయడానికి చూడగా ఎస్ఐ కుమారస్వామి, అదనపు ఎస్ఐ సీహెచ్ నాయుడు అడ్డుకున్నారు. మండల వలంటీర్ల సంఘం అధ్యక్షుడు మజ్జి సోమేష్, వలంటీర్ల సంఘ నాయకులు హరీష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

● గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో వలంటీర్లు పెద్ద ఎత్తున ర్యాలీ జరిపి, ప్రధాన రోడ్డులో మానవహారం నిర్వహించారు. ఏఎల్‌పురం, పాత కృష్ణదేవిపేట, కొంకసింగి, నాతాపురం పంచాయతీలకు చెందిన వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడినా.. ప్రజా సేవలో..



దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీ పరిధి కోరాడ గిరిజన గ్రామంలో గలేరి కృష్ణ గత నాలుగేళ్లుగా వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తన పరిధిలోని 50 ఇళ్లకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నారు. కరోనా సమయంలో నిరంతరం ప్రజలను అప్రమత్తం చేశారు. కోవిడ్ ఉధృతంగా ఉన్న రోజుల్లోనే 2020లో ప్రమాదశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడి కాలు, చేయి విరిగిపోయింది. కాలుకు ఆపరేషన్ జరిగిన కొన్ని రోజులకే కట్టుతోనే వాకర్ సహాయంతో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. ఇతర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా అంత కష్టంలోనూ కృషి చేశారు.

చింతలపూడిలో కాలుకు గాయంతోనే వృద్ధాప్య పింఛన్ సొమ్మును అందజేస్తున్న వలంటీర్ గలేరి కృష్ణ

ఆపదలో అండగా..



సత్యనారాయణరాజుకు పింఛను అందజేస్తున్న వలంటీర్

నాకు ఆరోగ్యం బాగులేకపోవడంతో హైదరాబాద్‌లో ఉంటూ చికిత్స పొందుతున్నాను. ప్రయాణాలకు వీలు లేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ద్వారా నాకు ప్రతి నెలా రూ.2750లు పింఛను వస్తోంది. నేను గ్రామంలో లేకపోవడంతో మా వార్డు వలంటీర్ వర్మరాజు హైదరాబాద్‌లో ఉన్న నా వద్దకు వచ్చి గడచిన మూడు మాసాల నుంచి పింఛను అందజేస్తున్నారు. అంత దూరంలో ఉన్న నా వద్దకు వచ్చి పింఛను అందజేయడం గొప్ప విషయం.

– సత్యనారాయణరాజు, వేంపాడు, నక్కపల్లి

ఆటో ఢీకొట్టి ఒకరికి గాయాలు

చోడవరం రూరల్ : స్కూటీతో రోడ్డు పక్కన ఆగి ఉన్న వ్యక్తిని వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో అతను గాయాలపాలయ్యాడు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు అందించిన వివరాలివి. అంబేరుపురం గ్రామానికి చెందిన ఇల్లపు నూకరాజు(40) ఈ నెల 8న ఉదయం 8 గంటల సమయంలో తన ఎలక్ట్రికల్ స్కూటీపై మంచినీటిని తీసుకురావడానికి ముద్దుర్తి గ్రామం వైపు వెళ్లాడు. మార్గమధ్యంలో మూత్ర విసర్జన నిమిత్తం రోడ్డు పక్కన ఆపి ఉండగా ఏపి 39 యుహెచ్ 1531 నంబరు గల ఆటో మితిమీరిన వేగంతో వెనుకగా వచ్చి ఢీకొట్టడంతో నూకరాజు కిందపడిపోయాడు. ఆటో అతడి మెడ, ఛాతీ మీదుగా దూసుకుపోయింది. దీంతో బాధితుడి కాలర్‌బోను ఫ్రాక్చర్ కాగా, చిన్నపాటి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చేరిన మీదట తమకు నూకరాజు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటు సీఐ తెలిపారు.

సరియా జలపాతం వద్ద పెద్దపులి సంచారం

- పర్యాటకులకు, గిరిజనులకు అటవీ శాఖ రేంజ్ అధికారి రవివర్మ హెచ్చరిక



సరియా జలపాతం పరిసరాలలో పర్యటించిన అటవీశాఖ అధికారులు (ఇన్‌సెట్) గుర్తించిన పులి పాద ముద్రలు

దేవరాపల్లి: అనంతగిరి, దేవరాపల్లి మండలాల సరిహద్దులో సరియా జలపాతం పరిసరాల్లో పెద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి రవివర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ పులి సంచరిస్తున్నట్లు స్థానికులు అందించిన సమాచారం మేరకు జీనబాడు అటవీ సెక్షన్ అధికారి రామకృష్ణ తదితర సిబ్బంది సరియా జలపాతం పరిసరాల్లో పర్యటించారన్నారు. అక్కడ గుర్తించిన పాద ముద్రలు ఆధారంగా పెద్ద పులి సంచరించినట్లు నిర్ధారించామన్నారు. ఇటీవల జీనబాడు నుంచి దేవరాపల్లి మండలం బుచ్చెంపాలెం మీదుగా చీడికాడ మండలం కోనాం పరిసరాల్లో సంచరించిన పులి ప్రస్తుతం సరియా జలపాతానికి ఆనుకుని దట్టమైన అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు పాద ముద్రలు గుర్తించామన్నారు. జలపాతం దగ్గరకు నీరు తాగేందుకు ఏ సమయంలోనైనా వచ్చే ప్రమాదం ఉందని, అక్కడకు వచ్చే పర్యాటకులు తమ పర్యటనలను కొన్ని రోజుల పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాలాబు సహా పరిసర గిరిజన గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అడవుల్లోకి ఒంటరిగా వెళ్లవద్దని హెచ్చరిక జారీ చేశారు.

యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: మండలంలోని ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో రెండు ప్రధాన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆయన పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పోలీసు, మైనింగ్, మండల పరిషత్, తదితర అధికారులతో సమీక్షించారు. ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి వడ్డాది వరకు పోవు రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, పూర్తిగా గోతులమయంగా ఉండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. 48 గంటల వ్యవధిలో ఎం. కోటపాడు వద్ద పూర్తిగా గోతులు పూడ్చాలని ఆదేశించారు. రహదారి పొడవునా పూడ్చాలన్నారు. ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి పోవు ఆర్అండ్‌బీ రహదారి పూర్తిగా గోతులమయంగా మారిందన్నారు. దీనికి ఇరువైపులా తుప్పలు, డొంకలు తొలగించాలని, తర్వాత గోతులు పూడ్చాలని ఆదేశించారు. ఓఎస్‌డీ పోలినాయుడు, తహసీల్దారు పి.వి. రత్నం, ఆర్అండ్‌బీ జేఈ సాయిశ్రీనివాస్, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ఎస్ఐ దామోదర్‌నాయుడు, ఎంపీడీవో మీనాకుమారి, పంచాయతీరాజ్, మైనింగ్, అధికారులతోపాటు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఏటికొప్పాక బొమ్మలపై దుష్ప్రచారం తగదు



ఏటికొప్పాకలో ర్యాలీ నిర్వహిస్తున్న హస్త కళాకారులు

యలమంచిలి : ఎంతో ఘన చరిత్ర కలిగిన ఏటికొప్పాక లక్కబొమ్మలపై సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారంపై ఏటికొప్పాక గ్రామంలో కళాకారులు గురువారం ఆందోళన చేపట్టారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బ్యానర్లు ప్రదర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాన్ని ఆపాలంటూ నినాదాలు చేశారు. ఈ నెల 10న ఫేస్‌బుక్‌లో విశాఖపట్నానికి చెందిన ఒక మహిళ ఏటికొప్పాక బొమ్మలకు ప్రమాదకరమైన రసాయనిక రంగులు వేస్తున్నట్లు పోస్టు పెట్టారు. ఇటీవల బొమ్మలు కొనడానికి ఏటికొప్పాక వచ్చినప్పుడు తన పరిశీలనలో ప్రమాదకర పెయింట్లు వేస్తున్నట్లు తాను గుర్తించానని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టు తమ కళను, ఉపాధిని దెబ్బతీసే విధంగా ఉందని, వెంటనే సామాజిక మాధ్యమాల్లో తొలగించాలని కళాకారులు డిమాండ్ చేశారు. 400 ఏళ్ల చరిత్ర కలిగిన లక్కబొమ్మల తయారీ కళ, ఇలాంటి చర్యలు వల్ల అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్కబొమ్మల సొసైటీ అధ్యక్షుడు, దిమిలి రమణబాబు, ప్రముఖ కళాకారుడు శ్రీశైలపు చిన్నయచారి, స్థానిక హస్త కళాకారులు పాల్గొన్నారు.

కాలువలోకి ఒరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు



ప్రమాదంలో దెబ్బతిన్న ప్రైవేట్ బస్సు

యలమంచిలి : నిద్రమత్తులో డ్రైవర్ అజాగ్రత్త వల్ల ప్రైవేట్ ట్రావెల్ బస్సు రోడ్డు పక్క కాలువలోకి దూసుకుపోయింది. రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలివి. విజయవాడకు చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు విశాఖపట్నం వెళుతుండగా గురువారం ఉదయం యలమంచిలి మండలం పురుషోత్తపురం హైవే సమీపంలో రోడ్డు పక్క కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బస్సులోని నలుగురు ప్రయాణికులు, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు తమకు అందలేదని రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

సింహాచలంనాయుడు మృతిపై ఆందోళనకు దిగుతాం

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న



దేవరాపల్లిలో మాట్లాడుతున్న వెంకన్న

దేవరాపల్లి: దేవరాపల్లిలో మార్చి 18న అనుమానాస్పదంగా మృతి చెందిన జామి సింహాచలం నాయుడు కుటుంబానికి న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న హెచ్చరించారు. ఈ మేరకు మృతుడు తల్లి సింహాచలమ్మ, మరికొందరు గ్రామస్తులతో కలిసి గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సింహాచలం కుటుంబానికి న్యాయంతోపాటు, అనుమానితులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 14న పోలీస్ స్టేషన్ ఎదుట నిరాహార దీక్ష చేశామన్నారు. ఆ సమయంలో అనకాపల్లి డీఎస్పీ ఫోన్లో మాట్లాడి కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయరావుకు కేసు దర్యాప్తును అప్పగిస్తామన్నారు. అప్పటికీ పురోగతి లేకుంటే కేసు ఫైల్‌ను మృతుడు తల్లికి అప్పగిస్తామని చెప్పడంతో దీక్ష విరమించామన్నారు. మూణ్నెల్లుగా న్యాయం చేయకపోగా, కేసుకు సంబంధించిన ఫైల్ ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే గ్రామస్తుల మద్దతుతో ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గవిరెడ్డి దేముడునాయుడు, బండారు అప్పలనాయుడు, జామి శ్రీను, చొక్కాకుల దేముళ్లు, జామి చిన్నంనాయుడు, పాసిల వెంకటరావు, పి. సతీష్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

చీడికాడ : కోనాం శివారు గుడివాడ వద్ద 22 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్టు ఎస్ఐ పి.రామారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ముందస్తు సమాచారం మేరకు బుధవారం సాయంత్రం కోనాం శివారు గుడివాడ వద్ద మాటువేసి తనిఖీలు నిర్వహించగా అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంకు చెందిన జన్ని పార్థు, కిరసాని ఈశ్వరరావుతో పాటు తమిళనాడు కంచిపురానికి చెందిన శరణ్ అనే వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారన్నారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని వారి నుంచి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తూ...

నర్సీపట్నం : ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని నర్సీపట్నం టౌన్ సీఐ ఎస్.గణేష్ తెలిపారు. సిబ్బందితో కలిసి చింతపల్లి రోడ్డులో గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 21.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. గంజాయి తరలిస్తున్న కేరళ రాష్ట్రానికి చెందిన అల్బిన్, కన్నన్, ఆదర్శ్‌తో పాటు వీరికి గంజాయి విక్రయించిన చింతపల్లికి చెందిన రవిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేడిగంజి మీద పడి బాలుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన నాలుగేళ్ల రోహన్ కృష్ణ

మునగపాక: గణపర్తి గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు రోహన్ కృష్ణపై వేడి గంజి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం రాత్రి రోహన్ కృష్ణ తల్లి లక్ష్మి అన్నం వండే క్రమంలో వేడిగంజిని వంట గదిలో ఉంచింది. పక్కనున్న గదిలోకి వెళ్లిన సమయంలో రోహన్ కృష్ణ వంటగదిలో వేడి గంజి ఉన్న పాత్రను తాకడంతో అతని శరీరంపై పడింది. బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు విశాఖలోని కిమ్స్ ఆస్పత్రికి వైద్యం కోసం తరలించారు.

సీఎం దృష్టికి సాగునీటి సమస్యలు

- చెర్లోపల్లి, ఎల్లయ్య కాలువ గ్రోయిన్లను పరిశీలించిన దాడి రత్నాకర్



దెబ్బతిన్న చెర్లోపల్లి గ్రోయిన్ పరిశీలిస్తున్న దాడి రత్నాకర్, రైతులు

అనకాపల్లి రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి అనకాపల్లి ప్రాంత రైతుల సాగునీటి సమస్యలను తీసుకెళ్లనున్నట్టు వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. మండలంలోని చెర్లోపల్లి, ఎల్లయ్య కాలువ గ్రోయిన్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు చెర్లోపల్లి గ్రోయిన్ ద్వారా 1,600 ఎకరాలకు, ఎల్లయ్య కాలువ ద్వారా 1,912 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. జలవనరుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వీటికి సకాలంలో మరమ్మతులు చేయలేదని రత్నాకర్ ఆక్షేపించారు. వీరి తీరు కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టకపోతే 100 నుంచి 200 మీటర్ల వరకు శిథిలమయ్యే ప్రమాదం ఉందని, ఇందుకోసం అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేయాల్సిందిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరనున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, వ్యవసాయదార్ల సంఘం కార్యదర్శి భీశెట్టి కృష్ణ అప్పారావు, గౌరీ పీఏసీఎస్ డైరెక్టర్ మళ్ల బుజ్జి, బొడ్డపాటి రాజారావు, కొణతాల విశ్వేశ్వరరావు, లెక్కల నాయుడు, సిరసపల్లి సన్యాసిరావు, దాడి రమణ, కాండ్రేగుల రాము పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లిటౌన్ : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ వి.సుబ్బరాజు చెప్పారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కశింకోట మండలం బయ్యవరం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి టీ దుకాణం వద్ద తిరుగుతుండగా అనుమానంతో తనిఖీ చేయగా వారి వద్ద 22 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితులు చీడికాడ మండలంలో జైతవరం గ్రామానికి చెందిన మొల్లి వెంకుబాబు, బైలపూడి గ్రామానికి చెందిన గోకివాడ చెల్లుబాబు తమిళనాడుకు చెందిన మదన్‌కు ఇచ్చేందుకు గంజాయిని తీసుకు వెళుతున్నట్టు విచారణలో వెల్లడైందన్నారు. పలుమార్లు గంజాయి కేసుల్లో ప్రమేయం ఉన్న ముగ్గురు వ్యక్తులపై పీడీ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే అనకాపల్లి పూడిమడక రహదారిలో ఏటీఎం చోరీకి పాల్పడిన వ్యక్తులను పట్టుకోవడానికి రెండు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఎ.రవికుమార్, కశింకోట ఎస్ఐ ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

స్పేసెస్ డిగ్రీ కాలేజీలో క్యాంపస్ సెలక్షన్స్ రేపు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 15న 'ది ప్లేస్మెంట్ పార్క్ విశాఖపట్నం' వారితో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. 2019, 2020, 2021, 2022, 2023 విద్యా సంవత్సరాల్లో ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు తమ బయోడేటా, సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని, ఎంపిక ప్రక్రియలో ముందుగా రాత పరీక్ష, తదుపరి ఇంటర్వ్యూ ఉంటుందని ప్రిన్సిపాల్ వీర్రాజు తెలిపారు.

లోవోల్టేజ్ నియంత్రణకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు


- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్



ఇండోర్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండింగ్ ఇంజినీర్ మహేంద్రనాథ్

నర్సీపట్నం: విద్యుత్ సరఫరాలో లోవోల్టేజ్‌ను నియంత్రించేందుకు ఎక్కడికక్కడ ఎక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. 33/11 కె.వి ఇండోర్ సబ్ స్టేషన్‌లో రూ.68 లక్షలతో ఏర్పాటు చేసిన 5 ఎం.వి.ఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఇండోర్ సబ్ స్టేషన్ సామర్థ్యం పెరిగి లోవోల్టేజ్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. దీంతో 26 వేల మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇదే తరహా ట్రాన్స్‌ఫార్మర్లను జిల్లాలో పలు చోట్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అకౌంట్స్ సిబ్బందితో సమీక్షించారు. వినియోగదారులకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. వారు కార్యాలయం చుట్టూ తిరగకుండా చూడాలన్నారు. రైతులు డబ్బులు చెల్లించిన తర్వాత నిర్దేశిత సమయంలో వ్యవసాయ కనెక్షన్ ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యానందం ఉన్నారు.

పాఠశాలలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు



కాలిపోయిన వంటగది తలుపులు

మాకవరపాలెం : పాఠశాలలో గ్యాస్ బండ నుంచి మంటలు చెలరేగిన ఘటన కలకలం సృష్టించింది. గిడుతూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు గురువారం వంటలు ప్రారంభించగా గ్యాస్ బండ పైపు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వంట గదిలో సామగ్రితోపాటు గది తలుపులు కాలిపోయాయి. వెంటనే ఉపాధ్యాయులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వాహనంతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

హుండీ దొంగ అరెస్టు

గొలుగొండ : మండలంలో లింగంపేట నూకాలమ్మ తల్లి ఆలయంలో హుండీ చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకి తరలించడం జరిగిందని కృష్ణదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. ఈనెల 11న తెల్లవారు సమయంలో వి. మాడుగుల మండలం వంతర్లపాలేనికి చెందిన పి.శ్రీనివాసరావు(43) నూకాలమ్మతల్లి ఆలయంలో హుండీ చోరీ చేసి సమీప గ్రామం అయిన రామచంద్రపురం వద్ద గ్రామస్తులకు దొరకడంతో గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో పూర్తి విచారణ చేసి గురువారం కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడి నుంచి రెండు వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్లుప్తంగా

ఏఎంసీ, మిరియాల కాలనీల్లో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక విజయరామరాజుపేట సమీపంలో వైఎస్సార్ అపార్టుమెంట్స్(ఏఎంసీ కాలనీ), మిరియాల కాలనీల్లో శుక్రవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక కార్పొరేటర్లు, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

పచ్చిమేతతో అధిక పాల దిగుబడి



సూపర్ నేపియర్ గడ్డి కణుపులను అందిస్తున్న పశు వైద్యాధికారి దయానా

కశింకోట: పాడి రైతులు మేలు జాతి పచ్చగడ్డి సాగు పట్ల దృష్టి సారించాలని కన్నూరుపాలెం పశు వైద్యాధికారి దయానా కోరారు. మండలంలోని ఈ.చౌడువాడ, పాత కన్నూరుపాలెం గ్రామాల్లో గురువారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో సమావేశాన్ని నిర్వహించి మేలు రకాల గడ్డి జాతుల పెంపకంపై అవగాహన కలిగించారు. పశువుల్లో పాల దిగుబడి పెరిగేందుకు పచ్చిమేత ప్రధానమన్నారు. దీంతో మేలుజాతి పచ్చగడ్డి, కాయ జాతి, పప్పు జాతి గడ్డిని పెంచుకోవాలన్నారు. కాయ జాతిలో ఆస్ట్రేలియన్ రెడ్ నేపియర్, సూపర్ నేపియర్, పప్పు జాతిలో బొబ్బర్లు, ఉలవలు, పిల్లి పెసర, జనుం, దశరథ గడ్డి తదితర రకాలు మెరుగైనవని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు సూపర్ నేపియర్ గడ్డి కణుపులను, జొన్న విత్తనాలను పంపిణీ చేశారు.

గొలగాం, సంపతిపురంలలో జగనన్న సురక్ష నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని గొలగాం, సంపతిపురం గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు హాజరవుతారన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, దరఖాస్తుదారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 136 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,100	4,100
మూడోరకం	---	---

అనకాపల్లి సినిమాలు

రుద్రంగి	:	రాజా
మహావీరుడు	:	సత్యనారాయణ స్క్రీన్-1
ఆదిపురుష్	:	సత్యనారాయణ స్క్రీన్-2
రంగబలి	:	షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	:	పర్తిసాయి
నాయకుడు	:	వెంకటేశ్వర
భాగ్ సాలే	:	శ్రీసత్య
సామజవరగమన	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-27 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 362 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

చోడి రైతుకు మంచి రోజులు

చిరు ధాన్యాలు పోషకాల గనులు. స్వల్పకాలంలో రైతుకు ఆదాయాన్నిచ్చే సిరులు. ఇందులో చోడి(రాగి) ప్రధానమైనది. ఆరుతడితో తక్కువ సమయంలో పంట చేతికొస్తుంది. ఆధునిక జీవన శైలి, గతి తప్పిన ఆహార అలవాట్లు, వెంటాడుతున్న రోగాలు.. వీటన్నింటి దృష్ట్యా మళ్లీ మన పూర్వీకుల ఆహారమే మేలనే రోజులు వచ్చాయి. ప్రభుత్వం కూడా చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది. దీంతో రైతులు చోడి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.



- క్వింటాకు రూ.3,876 మద్దతు ధర
- అతి తక్కువ నీటితో సాగుకు అవకాశం
- చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం



సాగులో ఉన్న చోడి పంట (ఇన్‌సెట్) సీతయ్యపేట సమీపంలో కోత దశకు చేరువైన చోడి పంట

అనకాపల్లి రూరల్: ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం చిరు ధాన్యాల సాగును బాగా ప్రోత్సహిస్తోంది. ముఖ్యంగా చోడి పంట సాగుకు అధిక ప్రాధాన్యమిస్తోంది. సాగు విస్తీర్ణం పెంచేలా, రైతులు సాగుకు ఆసక్తి చూపేలా క్వింటాకు రూ.3,876 మద్దతు ధర ప్రకటించింది. మరో వైపు కొర్ర, సజ్జ, జొన్న పంటల సాగును కూడా ప్రోత్సహిస్తోంది. వర్షాధార భూముల్లో చిరుధాన్యాలు సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బలవర్థక ఆహారంగా ప్రతిరోజు ఉదయం రాగి జావను అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో గర్భిణులు, బాలింతలకు చోడి పిండి సరఫరా చేస్తోంది. బహిరంగ మార్కెట్లో కూడా దీని వినియోగం ఇటీవల బాగా పెరిగింది. మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా సాగు విస్తీర్ణం పెంచేలా రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

సబ్ డివిజన్‌లో సాగు ఇలా...

అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్, రబీ సీజన్లలో మొత్తం 683 హెక్టార్లలో తృణధాన్యాలు సాగు చేస్తున్నారు. వీటిలో సజ్జలు 608 హెక్టార్లలో, మొక్కజొన్న 67 హెక్టార్లలో, 7 హెక్టార్లలో రాగులు సాగవుతున్నాయి. ఈ సారి ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 19 హెక్టార్లలో రాగులు సాగు చేసేందుకు అధికారులు రైతులను చైతన్యపరుస్తున్నారు. క్రమేణా చిరుధాన్యాల సాగుకు రైతుల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ పంట కాలపరిమితి రెండు మూడు నెలలే. దీంతో రెండో పంట సాగుకు కూడా వీలుగా ఉంటుంది. పూర్తిగా సేంద్రియ ఎరువులతో సాగుచేసే పంట కావడం, దిగుబడులు కూడా బాగానే ఉండటం, మార్కెట్లో క్రమంగా వీటికి డిమాండ్ పెరుగుతున్నందున రైతులు వీటి సాగుకు మొగ్గుచూపుతున్నారు.

లాభదాయకం

చోడి సాగు అన్నదాతలకు లాభదాయకంగా ఉంది. పెట్టుబడి కూడా తక్కువే. వరి పంట మాదిరి చోడి పంటకు సాగునీటి అవసరం ఉండదు. ఆరుతడి ఉంటే చాలు. ఖరీఫ్‌లో వర్షాధారంపైనే పంట చేతికి వస్తుంది. ఎరువులు, పురుగుమందుల పిచికారీ లేకుండానే పంట చేతికందుతుంది. ఖరీఫ్‌లో ఎద పద్ధతిలో ఎకరా విస్తీర్ణంలో చోడి పంట సాగుకు రూ.5 వేలు నుంచి రూ.6 వేలు వరకు ఖర్చవుతుంది. పంటకు చీడపీడల బెడద ఉండదు. పంట కలిసి వస్తే ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల మధ్య దిగుబడి వస్తుంది.

నష్టం లేని పంట.. ఆరోగ్యదాయకం



చోడి నష్టం లేని పంట. మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ పంట సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం మద్దతు ధర పెంచింది. చోడి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. విత్తనాలు అందిస్తున్నాం. ఎటువంటి నేలలో సాగు చేసినా పంట కలిసి వస్తుంది. ఉత్సాహంగా ముందుకొచ్చే రైతులను ప్రోత్సహిస్తాం. స్వల్ప కాలంలో తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు పొందవచ్చు. చోడిలో పోషక విలువలు అధికంగా ఉంటాయి. బీపీ, సుగర్ వ్యాధులను అదుపులో ఉంచుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచి ఆహారం.

– ఎం రామారావు, ఏడీఏ, అనకాపల్లి

ట్రిపుల్ ఐటీలో మెరిసిన విద్యార్థులు



పి.పూర్ణిమ



దోసూరి అన్షిత



కొవ్వాడ మోక్షిత



దోకుల బిందు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం మహాత్మా జ్యోతీరావుపూలే గురుకులం, వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో మెరిశారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వీరు వివిధ ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. ప్రభుత్వం గురువారం విడుదల చేసిన మెరిట్ జాబితాలో గురుకులానికి చెందిన జయదేవ్, కిరణ్‌గణేష్, దేవకుమార్, వంశీ అజయ్, ఆడారి గోపి, సీహెచ్ రామకృష్ణ, కర్రి జయవర్ధన్‌లు, వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలకు చెందిన పి.పూర్ణిమ, దోసూరి అన్షిత, సాలాపు వర్షిణి, ఎస్.భవానీ, కొణతాల లక్ష్మీమణి, కె.ఝాన్సీలక్ష్మిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన జాబితాలో ఉన్నారు.

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో చదివి పదో తరగతి ఉత్తమ ప్రతిభ కనబరచిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరిలో ముగ్గురు బాలికలు ఉన్నారు. ఈ ఏడాది టెన్త్‌లో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన కొవ్వాడ మోక్షిత, డోకుల బిందు నూజివీడు ట్రిపుల్ ఐటీకి, ఆ తర్వాతి స్థానాల్లో నిలిచిన కరణం రాకేష్, కౌసర్ సుల్తానాలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు గురువారం తెలిపారు. తమ స్కూలు నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం ఇదే ప్రథమమన్నారు. విద్యార్థులు మీడియాతో మాట్లాడుతూ ఇంజనీర్లు కావాలన్నది తమ కల అన్నారు. ఈ మేరకు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో తమ కల నెరవేరనుందన్న ఆశాభావం, ఆనందం వ్యక్తం చేశారు. వీరిని హెచ్‌ఎంతోపాటు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆచంట రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు, రేపు కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి ఏసీ కల్యాణ మండపంలో ఈ నెల 14, 15 తేదీల్లో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు (డీఆర్కే కప్) నిర్వహిస్తున్నట్టు నిజిసో టోకాన్(ఎన్‌ఎస్‌ఎస్‌కేఏఐ) స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ప్రతినిధి ఎస్.పి.ఎం.డి.నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను 14న ఉదయం 9 గంటలకు పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ప్రారంభించనున్నట్లు పేర్కొ న్నారు. ఐదు రాష్ట్రాల క్రీడాకారులు తలపడతారన్నారు.

ఉపాధి ద్వారా జంగిల్ క్లియరెన్స్

కోటవురట్ల: వర్షాకాలం రావడంతో రోడ్లకిరువైపులా పిచ్చిమొక్కలు మరింత ఏపుగా పెరిగిపోతున్నాయి. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోనే పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఎమ్మార్వో, పీఆర్, పశు వైద్యశాల, భవిత భవనం, స్త్రీశక్తి భవనం, సమావేశ మందిరం, ఆర్బీకే, హౌసింగ్ కార్యాలయం, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం, గ్రంథాలయం, సబ్‌ట్రెజరీ కార్యాలయం, పౌర సరఫరా గిడ్డంగి ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా పాములు సంచరిస్తున్నాయి. పలువురి ఫిర్యాదుతో అధికారులు గురువారం జంగిల్ క్లియరెన్సు చేపట్టారు. ఉపాధి కూలీలతో ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించే పని ప్రారంభించారు.

మునగపాకలో ఆరోగ్య సర్వే



ఆరోగ్య సర్వే చేపడుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

మునగపాక: మండల కేంద్రంలో గురువారం 6వ విడత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. మునగపాక పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలతో పాటు క్షేత్రస్థాయిలో అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. బీపీ,సుగర్,ఎత్తు, బరువులను పరీక్షించారు. మండలానికి ఒక గ్రామాన్ని సర్వేకు ఎంపిక చేశారు.దీనిలో భాగంగా మునగపాక గ్రామాన్ని ఎంపిక చేసిన అధికారుల బృందం స్థానిక సిబ్బందితో కలిసి సర్వే చేపట్టారు. ప్రతీ సర్వే అధికారికి 22 ఇళ్లను కేటాయించారు. సిగ్మా రీసెర్చ్ సంస్థ టీమ్‌లీడర్ ఆర్.తారకాచారి నేతృత్వంలో ఏడుగురు సభ్యుల ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్న బృందానికి మునగపాక పీహెచ్‌సీ సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎం.ఉమామహేష్, ఏఎన్‌ఎం దేవకి తదితరులు సహకరించారు.

వాడచీపురుపల్లి పీహెచ్‌సీలో వసతులపై ఆరా



పీహెచ్‌సీలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్

పరవాడ: వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అనకాపల్లి డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్ గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. మందులు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాయుడుపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రక్త పరీక్షలు, మందులపై ఆరా తీశారు. స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు పోషకాహారం, ఐరన్ మాత్రల పంపిణీపై వాకబు చేశారు. చిన్నారులకు ఐరన్ మాత్రల పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాస్త తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర కాస్త తగ్గింది. గత వారం కిలో రూ.150 ఉండగా, ఈ వారం రూ.30 తగ్గి రూ.120కి విక్రయాలు సాగాయి. ఉల్లి ఎప్పటిలాగే కిలో రూ.25, బంగాళాదుంప, క్యాబేజీ, బెండకాయలు రూ.30, దొండ, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్ రూ.60, బీరకాయ రూ.80, క్యాప్సికం రూ.100కు అమ్మకాలు జరిగాయి. గోబీ పువ్వు రూ.50 నుంచి రూ.70కి విక్రయాలు సాగాయి. అల్లం(రూ.200), పచ్చిమిర్చి(రూ.250) ధరలు స్థిరంగా ఉన్నాయి.

రూ.13 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీలు

కశింకోట: స్థానిక కస్పావీధి ప్రాథమిక పాఠశాల-1 నుంచి సతకంపట్టు రామాలయం వరకు రూ.13 లక్షలతో సిమెంటు రోడ్డు, కాలువలను నిర్మించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు గురువారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిధులు మంజూరు చేసినట్టు వెల్లడించారు. పనులు జరిగే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.

16న మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లిటౌన్: అనకాపల్లి గ్రీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న మునగపాక మండలం ఎంపీపీ పాఠశాల-2, ఎస్సీ కాలనీలో ఉదయం 8 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రకాలైన 2 వేల మొక్కలను నాటనున్నట్టు పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చోడమాంబిక అమ్మవారి సన్నిధిలో యోగి రాజ్ స్వామీజీ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లిలో చోడమాంబిక అమ్మవారిని అవధూత యోగి రాజ్ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఈ ఆలయం మరింత ప్రసిద్ధి చెందుతుందని, ఇక్కడి వాతావరణం చాలా బాగుందని అన్నారు. కార్యక్రమంలో లాలం సత్తిబాబు, కె.ఆర్.కె రాజు, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాయిమందిరంలో అన్న సమారాధన



సాయిబాబాను దర్శించుకుంటున్న చైర్మన్ యల్లపు విజయలక్ష్మి

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెం దాసరిగెడ్డ రోడ్డు సాయిబృందావనం కాలనీలో ఉన్న శ్రీకృష్ణ సాయి దివ్యమందిరంలో గురువారం అన్నసమారాధన జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సాయినాథుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు, ఆలయ చైర్మన్ యల్లపు వెంకటరమణ, విజయలక్ష్మి దంపతులు మాట్లాడుతూ మందిరంలో ప్రతి గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2015లో తమ సొంత భూమిలో సొంత నిధులతో సాయి మందిరం నిర్మించామని, అప్పటి నుంచి మందిరంలో నిత్య పూజలు జరుగుతున్నాయన్నారు. త్వరలో మందిరం ఎదురుగా మరో భవనం నిర్మించి సాయినాథుని నిత్య భజనలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులే ప్రజల వద్దకు వచ్చేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం దిబ్బవీధి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల 50 వేల సర్టిఫికెట్లను జారీ చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ఆరోగ్యశ్రీ, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, రైతు భరోసా వంటి పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వర్షాకాలంలో ఐరన్ పోల్స్‌తో విద్యుత్ షాక్‌కు గురవకుండా సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలందరూ జగనన్న అందించే సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని జీవన ప్రమాణాల్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. అనంతరం జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో జెడ్సీ ఎస్.వెంకటరమణ, డీటీ వై.శ్రీరామ్మూర్తి, జీవీఎంసీ ఆర్‌ఐ మర్ర శేఖర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు, సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రూ.కోటితో యల్లయ్యకాలువ పూడిక తొలగింపు



యల్లయ్యకాలువలో చురుగ్గా పూడికతీత పనులు



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న రత్నాకర్

అనకాపల్లిటౌన్: పట్టణంలో యల్లయ్యకాలువ పూడికతీత పనులు గురువారం ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ జోనల్ అధికారులకు కాలువ పూడికతీత సమస్యపై వివరించిన స్వల్ప కాలంలోనే స్పందించారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ తెలిపారు. పూడిక తొలగింపు పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. రూ.కోటితో కాలువ పూడికతీత పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ నుంచి పనులు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే పంట పొలాలకు సమృద్ధిగా సాగునీరు అందుతుందన్నారు. వర్షాలు కురవకముందే పూడికతీత పనులు పూర్తి చేస్తామన్నారు. పట్టణంలో పలు చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

స్థానిక పెరుగుబజారు – రైల్వేస్టేషన్ వరకు రహదారి విస్తరణ పనులను దాడి రత్నాకర్ గురువారం పరిశీలించారు. రహదారికి ఇరువైపులా ఉన్న భవన యజమానులు, వ్యాపారస్తులతో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు విస్తరణకు సహకరించాలన్నారు.

డిస్టిలరీ వ్యర్థాలపై గ్రామస్తుల ఆందోళన



సుందరయ్యపేటలో డిస్టిలరీ పరిశ్రమ వద్ద గ్రామస్తుల ఆందోళన

కశింకోట: మండలంలోని సుందరయ్యపేట గ్రామం వద్దనున్న ఓ డిస్టిలరీ పరిశ్రమ ఎదుట స్థానికులు గురువారం ఆందోళన చేపట్టారు. పరిశ్రమలో మద్యం తయారీ తర్వాత మిగిలిన వ్యర్థాలను బహిరంగంగా విడుదల చేయడం వల్ల ఆ నీరు సేవించిన పశువులకు హాని కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్లే గతంలో 15 వరకు మేకలు మృతి చెందినట్లు ఆరోపించారు. కలుషిత జలాలు నిల్వ ఉంచే గొయ్యి నిండి, సమీప పంట పొలాలకు చేరి పంటను దెబ్బతీస్తోందన్నారు. యాజమాన్యం సంప్రదింపులు జరపడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తమ సిబ్బందితో పర్యవేక్షించారు.

సంచార జాతులకు న్యాయం చేయాలి



సంచార జాతుల కుటుంబాలతో రొట్ట లక్ష్మి

అనకాపల్లిటౌన్: సంచార జాతులకు న్యాయం చేయాలని అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రొట్ట లక్ష్మి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం మేదర్ల గుడిసెల వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 76 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో సంచార జాతులకు సరైన న్యాయం చేయలేదని, రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులు రాకుండా చేశారని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం రావడంలో సంచార జాతులు కీలక భూమిక పోషించాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, తమ జాతులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఎన్టీ బోర్డు కార్యవర్గ సభ్యులను వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు పసుపులేటి సావిత్రి, జిల్లా గౌరవ అధ్యక్షులు రొట్ట ఈశ్వరరావు, రొట్ట ఆదినారాయణ, పిల్లి శ్రీను, యానం సంతోష్, పసుపులేటి నీలకంఠం, రెడ్డి అర్జున తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో 19న 'జగనన్న సురక్ష'

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సచివాలయం-2 పరిధిలో ఈ నెల 19న జగనన్న సురక్ష కార్యక్రమం జరగనుంది. దీనిలో భాగంగా సచివాలయం-2 పరిధిలోని ఆదిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం సర్వే చేశారు. ఈ సర్వేను జగనన్న సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. వారం రోజుల పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పలు ధ్రువపత్రాలు అవసరమైన వారిని గుర్తించనున్నారు. జగనన్న సురక్ష క్యాంపులో వారికి ఆయా ధ్రువ పత్రాలు అందజేయనున్నట్లు కొటాన రాము తెలిపారు. దరఖాస్తుదారులు తమ వలంటీర్ల వద్ద సురక్ష యాప్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడు, ఎంఎల్‌వో హేమంత్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

బదిలీలను వెనక్కి తీసుకోవాలి



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నేతలు

అనకాపల్లిటౌన్: ఉపాధ్యాయ బదిలీలను రద్దు చేయాలంటూ స్థానిక డీఈవో కార్యాలయం ఎదుట గురువారం యూటీఎఫ్ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ బదిలీలపై వెళ్లిన టీచర్లకు ఇప్పటి వరకు జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. యూటీఎఫ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.